

# తోడొకరుండిన....

## – శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**ఆ నాటి నుండి మిత్రత్రయం** మిత్రచతుష్టయంగా మారారు. క్లాసు రూంలో వెనక ఏదో మూలన ఒంటరిగా కూర్చునే కుసుమను టీచర్ అనుమతితో తమ మధ్య చేర్చుకున్నారు.

వాళ్ళ ఫ్రెండ్‌షిప్ తో కుసుమలో కొంత మార్పు రాసాగింది. ఆమె చిన్నాన్న తాతగారు  రెగ్యులర్‌గా టీచర్ల ద్వారా ఆమె అభివృద్ధి గురించి తెలుసుకుంటూ వుండేవారు. అట్లా ఆ స్నేహితురాళ్ళ గురించి కూడా తెలిసింది.

ఒకనాడు చిన్నాన్న వాళ్ళు వున్న దగ్గరకు వచ్చారు. ఆయనను చూడగానే కుసుమ "ఏంటి చిన్నాన్నా ఇట్లా వచ్చావు?" అంటూ సంబరంగా అడిగింది. ఆమెను ఆ విధంగా ఆనందంగా చూసేటప్పటికి ఆయనకు కళ్ళు చెమర్చాయి. "ఏంలేదమ్మా, ఇటుగా వెళ్ళుతున్నాను. అట్లాగే స్కూల్ లో నిన్ను చూద్దామనిపించి ఇటు వచ్చాను. వీళ్ళు నీ ఫ్రెండ్సా? నాకు పరిచయం చేయవా?" అంటూ ఆప్యాయంగా అడిగాడు.

"ఓ అయామ్ సారీ చిన్నాన్నా. వీళ్ళు ముగ్గురు నాబెస్ట్ ఫ్రెండ్స్. నాకు తెలుగు నేర్చుకోవటంలో ఎంతో హెల్ప్ చేస్తున్నారు." అంటూ పేరుపేరునా పరిచయం చేసింది.

"చాల సంతోషమమ్మా. నీకు ఇంతమంచి ఫ్రెండ్స్ దొరికారు కదా! వాళ్ళను ఒకసారైనా మన ఇంటికి ఇన్వైట్ చేసావా?" అంటూ,

"అమ్మాయిలూ ఈ నాటి నుండి మీరు మా కుసుమకే కాదు మా ఫామిలీకి కూడా ఫ్రెండ్సే. ఈ శుభ సందర్భంగా మీరందరూ ఈ ఆదివారం మా ఇంటికి భోజనాలకు రావాలి." అంటూ ఆప్యాయంగా పిలిచారు.

ముగ్గురూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. కళ్ళతోనే సైగలు చేసుకున్నారు.

"ఓకే. మీరు కుసుమకే కాదు ఈ వాళ్టి నుండి మాకు కూడా  చిన్నాన్నే. అయితే భోజనానికి రావాలంటే ముందుగా మేము ఇళ్ళల్లో పర్మిషన్ తీసుకోవాలి కదా! కనుక ఈ రోజు ఇంట్లో చెప్పి వాళ్ళు సరే అంటే మేము కూడా సరే." చురుగ్గా సమాధానంచెప్పిన తరుణిని చూస్తే ఆయనకు బహు ముచ్చటగా అనిపించింది. వీళ్ళ సహవాసంలో కుసుమ అనుకున్నదానికన్నా తొందరగానే మామూలు మనిషి అవుతుందన్న నమ్మకం కలిగింది.

"అరె తర్ని పున్నిమ! కుస్మకు లెక్క జర నాకుభీ తెల్గు లెసన్స్ సంజాయించ రాదువే. క్లాస్ల గా టీచర్ చెప్పెడ్డి అర్థమైతలే" ఆ  బాష విన్న నలుగురు వులిక్కి పడి ఒక్క సారె తలలెత్తి చూసారు.

ఎదురుగా క్లాస్మేట్ లూసి. స్కూల్ సింగింగ్ టీం కు లీడర్.  స్కూల్లో ఏ కార్యక్రమమైనా ప్రార్థనా గీతం, ఇతర పాటల కార్యక్రమాలు ఏమున్నా లూసీ ముందర వుండవలసిందే. ప్రతి సంవత్సరం స్కూల్లో జరిగే పాటల పోటీలో ఆమెకే ఫస్ట్ ప్రైజ్.  ఇంటర్ స్కూల్ పోటీలలో కూడా లూసీ మూలకంగా ఆ స్కూల్‌కే ప్రైజ్ లన్ని వస్తూ వుంటాయి.

లూసీ అనగానే ఓ ఆ పాటల అమ్మాయా అంటారు. కాని చదువులో మటుకు శుద్ద మొద్దు. ఏదో బొటాబొటీ మార్కులతో లాక్కొస్తూ తెలుగులో ఎదో టీచర్ల దయాదాక్షిణ్యాలమీద నెట్టుకొస్తుంటూంది.

"అరె లూసీ ముందుగాల మా పేర్లు మంచిగ అనెడిది నేర్వవే. అయినంక లెసన్ ముచ్చట చూద్దం." అదే తీరుగా సమాధానం చెప్పిన పూర్ణిమ మాటలకు తక్కిన ముగ్గురు ఫక్కున నవ్వేసారు.

"మా ఇండ్లల గిట్లనె అంటం. మీ ఆంద్రోల్ల లెక్క మాట మాకు రాదు." లూసీకి ఉడుకుమోత్తనం వచ్చి మూతి ముడుచుకుంది.

"అది కాదు లూసీ, ఉచ్ఛారణ సరిగ్గా లేకపోతే రాతలో కూడా బోలెడు తప్పులు దొర్లుతాయి. అందుకనే తరుణి అట్లా నిన్నుఎగతాళి చేసింది. నువ్వు అంతకే అంత ఫీలై పోతే ఎట్లా?" అనునయించింది పూర్ణిమ.

"అంతే కాని నిన్ను ఆంధ్రావాళ్ళలాగా మాట్లాడమనలేదు. ఆంధ్రా వాళ్ళంటే ఎవరు? ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్కరకం యాస వుంటుంది. అదివేరే భాష కాదు. యాస మాత్రమే. దానినే మాండలికం అంటారు.

మన తరుణిని చూడు. అది టిప్పికల్ గోదావరి ప్రాంతం. వాళ్ళ ఇళ్ళల్లో కూడా ఒక రకంగా దీర్ఘాలు తీస్తూనే మాట్లాడుతారు. కొన్ని పదాలైతే మాకు కూడా అర్ధం కాదు.

నాకు వాళ్ళింట్లో వాడే పదాలు కొత్తగా వుండేవి. మేమేమో గుంటూరు ప్రాంతం వాళ్ళము. మాది ఇంకొంచం బేధం. కుసుమ దైతే మరీనూ. వాళ్ళ తాతగారు నెల్లూరు నుంచి వచ్చారు. అక్కడ దాదాపు తమిళులు మాట్లాడినట్టె వినిపిస్తుంది. మొదట్లో నైతే కుసుమ ఇంటికి వెళ్ళినప్పుడు వాళ్ళు తమిళం మాట్లాడుతున్నారో తెలుగు మాట్లాడుతున్నారో తెలిసేదే కాదు. రేణుక కర్నూలు. అక్కడకొద్దిగా కన్నడ ప్రభావం వుంటుంది.

కాని లూసి చూసావా, మేమందరమూ వేరేవేరే ప్రాంతాల నుండి వచ్చినా ఇళ్ళల్లో ఆ యాసతోనే మాట్లాడినా స్కూల్ కొచ్చేటప్పటికి ఒకే విధంగా మాట్లాడుతామా లేదా? అంత మాత్రాన ఆంధ్రా వాళ్ళు తెలంగాణా వాళ్ళు రాయలసీమ వాళ్ళు అన్న బేధం వుండకూడదు తెలుసా?

ఇప్పుడు మా పేర్లే తీసుకో. నువ్వన్నట్టే తర్ని అనటానికి తరుణి అనటానికి తేడా లేదా? నా పేరు పున్నిమ కాదు. పూర్ణిమ. నువ్వు ఎట్లా రాస్తావో అట్లాగే పలకాలి. అట్లా కాకుండా నువ్వు తప్పుగా పలుకుతూవున్నావనుకో రేపు పరిక్షలోకూడా అదే విధంగా రాసే ప్రమాదం వుంది. అందుకనే చెప్పుతున్నాము. అంతే కాని నిన్ను ఎగతాళి చేయటానికి కాదు."

"అవును లూసీ, పూర్ణిమ ఒక్క తెలుగులోనే ఇన్ని బేధాలు వున్నయని చెప్పింది కదా! అన్నే బేధాలు హిందిలో కూడా వుంటాయి. నేను మొదట్లో బాంబే నుండి వచ్చినప్పుడు ఇక్కడ భాష గమ్మత్తుగా వుండేది. మేము నార్త్ ఇండియాలో అన్ని ప్లేసెస్ చూసాము. అందరూ హిందీ భాషే మాట్లాడుతారు కాని ఒకప్రాంతంలో వున్నట్టు ఇంకో ప్రాంతంలో వుండదు తెలుసా! కాకపోతే అందరికి అర్ధమయ్యేలాగా అఫిషియల్‌గా ఒక రకపు భాషే వాడుతారు. అదే నేషనల్ న్యూస్‌పేపర్లలోనూ పార్లమెంట్లోనూ చివరకు సినిమాలలోనూ వుంటుంది." కుసుమకూడా తన అభిప్రాయం తెలిపింది.

లూసి కొంత సమాధానపడింది. "అవ్. యశోద తిరుమలరెడ్డి తెల్సా, ఒకపాలి ఆమె ప్రోగ్రాం ఐతె అమ్మ నాయ్నతోని నేను కూడ వెళ్ళంటి. బయట మావోళ్ళ లెక్క మంచి తెలంగాన మాటాడెటామె స్టేజి పైకెల్లెతలికి మీలెక్క ఆంధ్ర బాస మాట్లాడింది."

"మరి అదే ఆమె గొప్పతనం. మా కజిన్ కోఠీ విమెన్స్ కాలేజిలో చదువుతుంది. యశోద మాడం గురించి తను కూడా అదే చెప్పుతుంది. క్లాసులో వున్నంతసేపు మాట్లాడే భాష బయట కొలీగ్స్ తో మాట్లాడే భాష వింటే, ఈవిడేనా అంత గొప్పగా సాహిత్యం గురించి లెక్చర్ ఇచ్చింది అని అనుమానం వస్తుందిట."

"ఆవిడ ఎంత గొప్ప సాహిత్యవేత్త కదా! అంతే ప్రాంతాభిమానం కూడా వుంది. అదే ఆవిడలో వున్న గొప్పతనం. అందరికి వుండ వలసిన ముఖ్యమైన లక్షణం కూడా. కొందరైతే వేరే స్టేట్ వెళ్ళిరాగానే, తెలుగే రానట్టు స్టైల్ కొడుతూ వుంటారు.

"అవ్ పూ..ర్..ణిమ, సరిగ్గ అన్ననా, మీకు గిసొంటి ముచ్చట్లు ఎట్ల తెలుస్తయే."

"ఎట్లనా, మా ఇంట్ల మా అమ్మ నాయ్న చిన్నమ్మలు చిన్నాయ్నలు మంచిమంచి బుక్స్ చదువుతర్వే. ఇంక మా నాయ్న దోస్తులు వస్తరు. ఇసొంటి ఇసయాలు మాటముచ్చట్లు చేస్తరు. గయన్ని ఇంట కన్క నాకూడ ఎర్కయితయి. ఏయ్ లూసీ నేను సరిగ్గా చెప్పానా?" అందరూ చప్పట్లు కొట్టారు. "నేను కావాలంటే ఏ ప్రాంతపు యాసనైనా ఇమిటేట్ చెయ్యకలను తెలుసా." అంటూ భుజంమీద చేయి పెట్టుకొని కాలర్ ఎత్తినట్టు నటించింది.

"అమ్మయ్య, ఈవాల్టికి కావల్సినంత భాషా శాస్త్రం మీద చర్చ సాగింది. ఇంతటితో ఈ నాటి కార్యక్రమం సమాప్తం. తిరిగి వీలును బట్టి కొనసాగించగలవారము." అంటూ పూర్ణిమ అనగానే అందరూ లేచారు.

అట్లా లూసీ కూడా కుసుమతో పాటు తెలుగు పాఠాలే కాక లెక్కలు కూడా నేర్చుకోసాగింది.

అది చూసిన హెడ్మిస్ట్రెస్ సంతోషించింది."లూసీ ఇప్పటికి నీకు మంచి కంపెనీ దొరికింది. ఇకనైనా మంచిగా చదువు. మీ అమ్మనాన్న ప్రతి ఆదివారం చర్చికొచ్చినప్పుడు నీ గురించే దిగులు పడుతూంటారు."

దసరా సెలవులు వచ్చేముందరనే క్వార్టర్లీ పరిక్షలు అయిపోవటం రిపోర్ట్ కార్డులు ఇవ్వటం కూడా జరిగిపోయింది. కుసుమ పర్ఫార్మెన్స్ చూసిన టీచర్ వాళ్ళ చిన్నాన్నను పిలిపించి, "ఇప్పటికైతే ఫరవాలేదు. కాని ఇంకా చాలా శ్రమ పడాలి. హాఫ్ ఇయర్లీలో కూడా మానేజి చేయవచ్చు. కాని ఏన్యువల్ ఎగ్జామ్స్ అందరితోపాటు ఎక్సాంకు ఎపియర్ అవాలి. మరి ఎట్లా చేస్తారో ఏమో." అంటూ వార్నింగ్ ఇచ్చింది.

దాంతో ఫ్రెండ్స్ అందరూ కలిసి యుద్ధప్రాతిపదికమీద కుసుమకు తెలుగు నేర్పించే పని మీద పడ్డారు.

తరుణి ఇల్లు చాల పెద్దది. ఆమెకంటూ ప్రత్యేకమైన గది, స్టడీ రూం కూడా వున్నాయి.

"నాన్నగారూ, మీకభ్యంతరం లేకపోతే కుసుమను ఈ దసరా సెలవులలో మనింటికి తీసుకొస్తాను. నేను పూర్ణిమ కుసుమ కలిసి కంబైన్డ్ స్టడీస్ చేద్దామనుకుంటున్నాము. అట్లా అయితే ఒకరు పూర్ గా వున్నసబ్జెక్ట్ లో ఇంకొకరి హెల్ప్ తీసుకోవచ్చు."

"నాకేమీ అభ్యంతరం లేదమ్మా. కాకపోతే తల్లి తండ్రిని పోగొట్టుకున్న పిల్ల కదా వాళ్ళ వాళ్ళ కోసం బెంగ పడుతుందేమో. వాళ్ళ తాతగారు చిన్నాన్నలు ఒప్పుకుంటే అట్లాగే కానీయి."

"తను బెంగ పడుతుందన్న అనుమానమే మీకక్కర లేదు నాన్నగారు. ఇంట్లో కన్నా మా దగ్గరే చాలా ఫ్రీగా వుంటుంది."

ఆ మాట ముమ్మాటికి నిజమే. స్కూల్లో వున్నంతసేపూ బాగానే వుంటుంది. ఇంటికెళ్ళంగానే షెల్ లోకి వెళ్ళిపోయిన నత్తగుల్లలాగా అయిపోతుంది. చిన్నాన్నల పిల్లలు అమ్మ నాన్న అంటూ తిరుగుతూ వుంటే తన మీద తనకే జాలి వేస్తూ వుంటుంది. ఇంట్లో అందరూ కుసుమను ఎంతో ప్రేమగా గారాబంగా చూసుకుంటారు. అదంతా తన మీద జాలితో అట్లా చేస్తున్నారని అనుకుంటూ వాళ్ళ సానుభూతి తనకు అవసరం లేదన్నట్టు ప్రవర్తిస్తూ వుంటుంది. ఒక్కొక్కసారి మరీ రూడ్ గా మాట్లాడుతుంటుంది.

ఇంట్లో పెద్దవాళ్ళు ఆమె గురించే కొంత దిగులు పడుతూంటారు. అటువంటి సమయంలో తరుణి ప్రతిపాదన అందరికి ఆనందం కలిగించినా అట్లా పంపిస్తే బాగుండదేమోనన్న అనుమానం వెలిబుచ్చారు. కాని ఫ్రెండ్స్ అందరూ రెకమెండ్ చేసేటప్పటికి ఒప్పుకోక తప్పలేదు.

ఎటువంటి డిస్టర్బెన్స్ లేకుండా దసరా సెలవలన్ని కూడా సద్వియోగం చేసుకున్నారు. అడపా తడపా రేణుక కూడా వచ్చేది. కాని ఆమె ధ్యాస అంతా సైన్స్ సబ్జెక్ట్స్ మీదే వుండటంతో వాటి మీదే కాన్సన్ట్రేట్ చేసేది.

మరుసటి సంవత్సరం వాళ్ళ లైఫ్ లో చాల ముఖ్యమైనది. వాళ్ళ భవిష్యత్తు చదువంతా దాని మీదనే ఆధారం. పదవ తరగతిలో

తీసుకొనే ఆప్షన్స్ ముందుముందు ఏం చదవాలో నిర్ణయించబోతుంది. అందుకే అందరూ దాని కోసం ఇప్పటి నుండే మెంటల్గా ప్రిపేర్ అవుతున్నారు.

రేణుక కైతే ఏ సమస్యా లేదు. బై పి సి తీసుకుంటుంది. అట్లాగే కుసుమ మాథ్స్ తీసుకోవాలని నిర్ణయించుకున్నది. ఎటు తిరిగి పూర్ణిమ తరుణి ఇంకా ఏమీ తేల్చుకోలేకపోతున్నారు. పూర్ణిమకు సాహిత్యమంటే అభిమానం. తరుణికి వ్యాపారవేత్త అవుదామని కోరిక. కాని దానికి పన్నెండవ తరగతి అయిన తరువాతే అవకాశం. ఇప్పుడు తొమ్మిదవ తరగతిలో వచ్చే మార్కుల బట్టి సైన్స్ తీసుకోవాలా మాథ్స్ తీసుకోవాలా అనేది నిర్ణయించుకోవాలని అనుకున్నారు. అందుకనే అన్ని సబ్జెక్ట్స్ మీద ధ్యాస పెట్టి మరీ చదువుతున్నారు.

"ఏమర్రా! మీ చదువులలో పడి నాయనమ్మ చేతి ముద్దలు మర్చిపోయినట్టున్నారే?" ఒకరోజు ముగ్గురూ మధ్యాహ్నం గదిలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు వచ్చింది జానకమ్మ.

"అయ్యో నాయనమ్మా! ఇదిగో ఈ రోజే మీ చేతి ముద్దలకోసం వస్తున్నాము. అసలే ఆకలేస్తోంది. అమ్మను ఏదైనా టిఫిన్ చేయమని అడగబోతున్నాను. పదండే. ముద్దలు తిని వద్దాము. అవును నాయనమ్మా, చిన్నచిన్న చింతకాయల పచ్చడి చేసారట కదా, ఆ అన్నం కావాలి." అంటూ చెంగున లేచింది తరుణి.

ముద్దలు తినటం ఏమిటో కుసుమకు అర్ధం కాలేదు. అయినా చూద్దామని తను కూడా వాళ్ళ వెంబడే వెళ్ళింది.

యధాప్రకారం బేసిన్ లో అన్నం పెట్టుకొని ఆమె కూర్చొని పిల్లల కోసం ఎదురు చూస్తున్నది. తతిమ్మా పిల్లలందరూ తిని వెళ్ళిపోయినట్టున్నారు. వీళ్ళ ముగ్గురికే కలుపుతోంది.

"అదేంటి నాయనమ్మా, చింతకాయ పచ్చడి కలపకుండా కూర కలుపుతున్నారు."

"పిచ్చిపిల్లా ఇప్పుడు వచ్చే వామనగాయల పచ్చడి తింటే జలుబు చేస్తుందే. అందుకే మొదట కూరముద్ద తినండి తరువాత పాత చింతకాయ తిందురుగాని."

తరుణి కొంత సేపు పచ్చడి లేదని గారాలు పోయి కాస్సేపు బ్రతిమిలాడించుకొని కూర్చున్నది.

ఈ వేషాలన్నీ పూర్ణిమ నవ్వుతూ చూస్తుంటే కుసుమకు ఆశ్చర్యంగా వుంది. ఆ బేసిన్ లో అన్నం కలిపిపెట్టటం ఏంటీ? ఫ్రెండ్ నాయనమ్మ దగ్గర తరుణి గారాలు పోవటం ఏంటి?

"రావే కుసుమా, అట్లాగే నిలబడ్డావే?" చేయిపట్టుకొని లాగింది తరుణి.

"వద్దు తరుణీ నాకు ఆకలిగా లేదు. మీరు తినండి."

"అదంతా జాన్తానై. నాయనమ్మ చేతిలో ముద్దలు తింటుంటే నీ ఆకలి ఎట్లా పెరిగిపోతుందో నువ్వే చూద్దువు గాని."

"రామ్మా కుసుమా. ఇది కూడా నీ ఇల్లే. నేను కూడా మీ నాయనమ్మ లాగానే. తెలిసిందా. భోజనం దగ్గర మొహమాట పడకూడదు." ఆ సమయానికే రేణుక కూడా వచ్చింది. "ఇంకేం అదిగో రేణుక కూడా వచ్చింది. రామ్మా."

"ఓ, గోరుచిక్కుడు కాయ కూరా? నాకెంతో ఇష్టం." అన్నది తరుణి.

"అదేంటే ఇది మటక్కాయలకూర కదా? గోరు చిక్కుడు కాయంటావేంటీ?"

రేణుక మాటలకు పూర్ణిమ పిన్నిసునంద సమాధానం చెప్పింది. "కడప కర్నూలు ప్రాంతంలో గోరు చిక్కుడు కాయలను మటక్కాయలు అంటారు. ఇక్కడేమో గోకర కాయలు అంటారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరు."

"అవును పిన్ని. మనము గోంగూర అనే దాన్ని ఇక్కడి వాళ్ళు పుంటికూర అంటారు. వీళ్ళేమో పుల్లకూర అంటారు కదే!"

"ఆ మధ్య గుంటూరు తప్ప వేరే ప్రదేశం తెలియని మా మామయ్య కూతురు వచ్చింది. భోజనాలు చేస్తూ మేము అమ్మా ఆలు కూర

వెయ్యి అంటే తను కూడా తింటూ ఇదేంటో అచ్చంగా మా బంగాళదుంపల కూరలాగా వుందే అంటే మేమంతా పడీపడీ నవ్వాము."

"ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుకొస్తుందమ్మా. డాక్టర్ యశోదా రెడ్డి గారికి ప్రాంతీయ అభిమానం మెండు. ఒకసారి సాహిత్యసభలో మహా పండితుడు ఒకాయన తెలంగాణా వాళ్ళు పుంటికూరపుంటికూర అంటే మాకు పుండు గుర్తుకొస్తుంది అన్నాడట. వెంటనే దానికి ఆవిడ మీరు గోంగూర గోంగూర అంటుంటే మాకు గొంగళి పురుగులు గుర్తుకొస్తాయి అని సమాధానం చెప్పిందట. అట్లా వుండాలి. అయినా ఒకరి భాషను యాసను మరొకరు గౌరవించాలి కాని ఎగతాళి చేయకూడదు కదా!"

నలుగురూ మొహాలు చూసుకొని నవ్వటం మొదలెట్టారు. పిన్నికి అర్థం కాలేదు. "ఏమ్మా, నేనన్న దాంట్లో ఏమైనా తప్పుందా?"

"సారీ పిన్ని. నిన్ను చూసి కాదు నవ్వింది. మా మధ్య కూడా ఇటువంటి డిస్కషనే వచ్చింది అది గుర్తుకొచ్చి నవ్వుతున్నాము అంతే."

"వద్దులే తల్లి ఈ భాషా శాస్త్రం మీద చర్చ వచ్చిందంటే మన పూర్ణిమకు ఒళ్ళు పై తెలియదు. ఇంక పిన్ని కూడా చేరిందంటే అంతే సంగతులు." అట్లా అందరూ సరదాగా ఏ ఏ ప్రాంతంలో ఏ కూరను ఏమంటారో చెప్పుకుంటూ నాయనమ్మ పెడుతున్న ముద్దలు తిని లేచారు.

"అమ్మడూ తరుణీ ఈ రోజు ప్రేమాలయం వెళ్ళొద్దాం. నువ్వు కలెక్ట్ చేసినవన్ని తీసిపెట్టుకో. అట్లాగే పండగ వస్తున్నది కదా యాదిని ఇంటికి తీసుకొద్దాం."

"అట్లాగే నాన్నా, పూర్ణిమ కూడా తీసిపెడతానంది. అవి కూడా తీసుకొస్తాను. పూర్ణిమను కుసుమను కూడా తయారవమంటాను."

"ఏయ్ లేవండే. నాన్న ఈ రోజు మనల్ని ప్రేమాలయానికి తీసుకెళ్తామంటున్నారు."

ప్రేమాలయం అంటే ఏదో సినిమా పేరో థియేటర్ పేరో అనుకుంటూ కుసుమ కూడా అందరితోపాటే బయల్దేరింది. ఆ పాటికే వాళ్ళ ఫామిలీలతో పాటు సినిమాలకు పార్కులకు వెళ్ళి రావటం అలవాటయింది. అందుకే వెంటనే తయారయింది

తీరా వెళ్ళి చూస్తే అది ఒక ఆశ్రమం. అయిదేళ్ళనుండి పద్దెనిమిది సంవత్సరాల వరకు అమ్మాయిలు వున్నారు.

వార్డెన్ ఆఫీసులో కూర్చున్నారు. ఆయన ఎంతో ఆదరంగా వారిని ఆహ్వానించాడు.

డ్రైవర్ కారులోంచి ఒక పెద్ద సంచి తీసుకొని వచ్చి ఒక వారగా పెట్టాడు.

"సార్, కొన్ని బట్టలు పుస్తకాలు పండ్లు వున్నాయి. అమ్మాయిలకు డిస్ట్రిబ్యూట్ చేయండి. దసరా పండగకు యాదిని మాతో తీసుకెళ్ళటానికి అనుమతి ఇవ్వగలరా?" తరుణి నాన్నగారు ఎంతో వినయంగా అడిగారు.

"అయ్యో ఎంత మాట? తప్పక తీసుకెళ్ళండి బాబుగారూ. వాళ్ళకు కూడా దసరా సెలవలే. పండగ మరుసటి రోజే స్కూళ్ళు తెరుస్తారు. కాబట్టి పండగ నాడు చీకటిపడే లోపలే తిప్పి పంపిస్తే బాగుంటుంది."

అక్కడే పని చేసుకుంటున్న ఒక పాపను యాదిని పిలుచుకు రమ్మని ఆదేశించాడు.

పదహారేళ్ళ అమ్మాయి వచ్చింది. శుభ్రంగా తలదువ్వుకొని, వుతికిన బట్టలు కట్టుకొని తయారయి వుంది.

గదిలో వున్న అతిథులను చూసి ఆమె ముఖం వికసించింది. "నమస్కారం బాబుగారూ, తరుణీ బాగున్నావా? ఓ పూర్ణిమ కూడా వచ్చిందే!" అంటూ అందరిని ఉచిత రీతిలో పలుకరించి, "ఈ అమ్మాయిని నేనెప్పుడూ చూడలేదే కొత్త ఫ్రెండా?" అంటూ కుసుమ గురించి విచారించింది.

"అవును యాదీ, ఈమె పేరు కుసుమ. మాఫ్రెండ్. కుసుమా ఈమె యాది." అంటూ ఒకరిని ఒకరికి పరిచయం చేసింది.

కుసుమకు ఏమీ అర్థం కావటల్లేదు. ఈ ప్రేమాలయం అనే ఆశ్రమం ఏంటీ? ఈ యాది ఎవరు? చూడటానికి సాదాసీదాగా సామాన్యంగా వుంది. తరువాత అడగ వచ్చని ఏమీ ప్రశ్నలు వేయకుండా యాదిని చూసి చిరునవ్వు నవ్వి వూరుకుంది.

వార్డెన్ గారు చెప్పగానే యాది వెళ్ళి తన బట్టల సంచి తీసుకొని వచ్చింది.

అందరూ కార్లో బయలుదేరారు. "ఏమ్మా యాదీ, చదువు బాగా సాగుతున్నదా?"

"బాగుంది బాబుగారూ. టైప్ ఇన్స్టిట్యూట్ కు కూడా పంపిస్తున్నారు. అది కూడా బాగా ప్రాక్టీస్ చేస్తున్నాను."

"వెరీ గుడ్. టైప్ తో పాటు షార్ట్ హాండ్ కూడా వుంటుందే! అది కూడా నేర్చేసుకో. పదవ తరగతి అయిపోగానే ఎక్కడైనా స్టెనోగ్రాఫర్ వుద్యోగంలో పెడతాను."

"అట్లాగే బాబుగారు."

ఇల్లు చేరిం తర్వాత యాది తన చేతి సంచి తీసుకొని మెట్ల కింద వున్న గది తాళం తెరిచి బాగా అలవాటైన దానిలా చేతి సంచి ఆ గదిలో పెట్టి వంటింట్లో తరుణి అమ్మకు సహాయం చేయసాగింది. అందరి భోజనాలు అయ్యాయి. స్నేహితురాళ్ళు ముగ్గురు తరుణి గదిలో చేరారు.

"తరుణీ ఆ అమ్మాయి ఎవరే? ఆ ప్రేమాలయం ఏమిటి?" అప్పటిదాక ఆపుకున్న కుతూహలం బయటికి వచ్చింది.

"అయ్యో! సారీ కుసుమా అసలు విషయం నీకు చెప్పనే లేదు కదా!

విజయవాడ దగ్గర మావూళ్ళో తాతగారికి పొలాలు వుండేవి. ఆయన పోయిన తరువాత ఆ పొలాలను ఒక రైతు చూసుకొనేవాడు. పాపం అతను చాల మంచి వాడు. ప్రతి సంవత్సరమూ పంటలు రాగానే అన్ని జమా ఖర్చులు లెక్కలు చెప్పేవాడు.

ఆ మధ్య పేపర్లలో చదువేము గుర్తుందా! ప్రతి ఎండాకాలం విజయవాడ ఆ చుట్టుపక్కల గ్రామాలలో అగ్ని ప్రమాదాలు తరుచుగా జరుగుతుండేవి. కొందరేమో అక్కడ ఎండలు ఎక్కువ అందువల్ల అనేవారు. కొందరేమో అదంతా పొలిటికలీ మోటివేటెడ్ అనేవారు. కారణాలు ఏవైనా కాని నాలుగేళ్ళ క్రితం అట్లా జరిగిన ప్రమాదంలో యాది తల్లితండ్రులు బంధువులు అందరూ మరణించారు. పాపం దానికి నా అనే వారే లేకుండా పోయినారు. సంగతి తెలిసి నాన్నగారు చూడటానికి వెళ్ళినప్పుడు అది ఒక్కతే ఆ తగలబడ్డ బూడిద దగ్గర కూర్చొని ఏడుస్తూ కనిపించింది. అంతే ఆయన వెంటనే దాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు. ఏదైనా దారి చూపించాలని అనుకున్నారు.

నాన్నగారికి చాల స్వచ్ఛంద సంస్థలతో పరిచయాలు వున్నాయి. వాటికి ఆయన ఏటా డొనేషన్ ఇస్తూ వుంటారు. అందులో ప్రేమాలయం ఒకటి. అందులో చేర్చాలని ఐడియా వచ్చింది. అక్కడైతే ఎటాచ్డ్ స్కూల్ కూడా వుంది. వాళ్ళు పదవ తరగతి వరకు ఫ్రీగా చదివిస్తారు. ఫార్మల్ ఎద్యుకేషనే కాకుండా ఒకేషనల్ కోర్సెస్ కూడా వుంటాయి. అట్లా ఏదో ఒక ట్రైనింగ్ ఇచ్చి వుద్యోగం వచ్చేదాకా చూసుకుంటారు. లేదా పెళ్ళి చేసుకొనేటట్టయితే చేసి పంపిస్తారు. ఆ ఆశ్రమంలో అందరూ ఇట్లాంటి వాళ్ళేవుంటారు. అక్కడ ఆడపిల్లలకి మాత్రమే చోటు వుంటుంది."

"అంటే అంతా నాలాంటి అనాథలేనన్నమాట."

ఆ పక్క గదిలోనే కూర్చొని అమ్మాయిల మాటలు వింటూ పని చూసుకుంటున్న తరుణి నాన్నగారు అక్కడకు వచ్చారు.

"అమ్మా కుసుమా! మీ తెలుగు పాఠాలలో నేను కూడా పాల్గొన వచ్చా?" నవ్వుతూ అడిగారు.

అదొక జోక్ లాగ అందరూ నవ్వారు.

"అయితే నేను కొన్ని అర్థాలు అడుగుతాను. మీరు చెప్పాలి." అంటూ కొన్ని చిన్నచిన్న పదాలు వాటి అర్థాలు వివరాలు అడిగారు. ముగ్గురూ పోటీ పడుతూ సమాధానాలు చెప్పారు. "ఇప్పుడు ఒక ప్రశ్న వేస్తాను. అనాథ అంటే వ్యుత్పత్తి అర్థం ఏమిటీ?"

"నా లాగా అమ్మ నాన్నలు లేనివారు." కుసుమ చెప్పింది.

"నేను వుదాహరణ అడగలేదు. వ్యుత్పత్తి అర్థం అడుగుతున్నాను. నువ్వే చెప్పు కుసుమా."

"ఊ.......ఊ......."ఆలోచించింది. "ఆఁ. అనాధ అంటే నాధుడు లేనివారు. కరెక్టేనా అంకుల్?" హుషారుగా చెప్పింది.

"వెరీ గుడ్. కరెక్ట్ గా చెప్పావు. తెలుగులో వ్యుత్పత్తి అర్థాలు చెప్పేదాకా వచ్చావంటే తరుణి పూర్ణిమ సక్సెస్ అయినట్టే. ఇప్పుడు చెప్పు. నాథుడు అంటే ఎవరు? అమ్మడూ మన దగ్గర బ్రౌణ్య నిఘంటువు వుంది కదా ఒకసారి తీసుకొని రారా."

"ఆ. ఇదిగో కుసుమా నాధుడు అంటే అర్థం ఏంటో చూడు." తరుణి షెల్ఫ్ లో నుండి తీసిన నిఘంటువు కుసుమ చేతిలో పెట్టాడు.

కుసుమకు అంకుల్ కూడా తమతో కలిసి కూర్చుంటే సరదాగా వుంది.

"ఆ దొరికింది అంకుల్. నాథుడు అంటే, ఎ లార్డ్, కింగ్ రాజు. అంకుల్ ఇందులో ఇవ్వలేదు కాని నాధుడు అంటే ఈశ్వరుడు అని కూడా అర్థం వుంది కదా."

"అవునమ్మా సరిగ్గ చెప్పావు. అంటే కాపాడే వాడు. ఇందులో చూడు ప్రొటెక్టర్ అని కూడా ఇచ్చారు."

"అవునంకుల్."

"అమ్మో! మా కుసుమకు ఎన్ని అర్థాలు తెలిసాయో." అని ఆశ్చర్యం నటిస్తూ, "సరే ఈ వేళ్టికి పాఠాలు చాలు కాస్సేపు కబుర్లు చెప్పుకుందాము. కుసుమా! మీ ఇంట్లో ఎవరెవరుంటారమ్మా?"

"అంకుల్, మీరు చూసారుగా! మా తాతగారు, బామ్మగారు, చిన్నాయనా పిన్ని వాళ్ళ ముగ్గురు పిల్లలు. అంటే నాకు ఇద్దరు చెల్లెళ్ళు ఒక తమ్ముడు వున్నారు."

"వాళ్ళు నిన్ను ఎట్లా చూసుకుంటారమ్మా?"

"మా ఇంట్లో నేనంటే అందరికి ఎంతో ముద్దు. నాకు ఏం కావాలో నేను అడగక్కర లేకుండానే అన్ని తెచ్చి ఇస్తూ వుంటారు. పిన్ని నాయనమ్మ అయితే మరీనూ. నాకు వద్దన్నా కూర్చున్న చోటికే అన్నం కూడా తెచ్చి పెడుతూ వుంటారు." అమాయకంగా మనసులోని మాట చెప్పింది.

"మరి నువ్వు అనాధవెట్లా అవుతావమ్మా?" ఆయన ప్రశ్నకు ఒక్కసారి వులిక్కి పడింది.

"అవునమ్మా ప్రేమాలయంలో వున్న వాళ్ళకు నీకు పోలికే లేదు. వాళ్ళకు నీకు లాగ వుండేందుకు ఇల్లు లేదు. మంచి చెడు చూసుకునేందుకు నా అన్న వారు లేరు. తినటానికి తిండి కట్టుకోవటానికి బట్ట ఉండటానికి ఇల్లు ఏమీ లేని వాళ్ళు. కొందరైతే చెత్త కుప్పలో దొరికిన వాళ్ళు"

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments